క్లుప్తంగా

శాకంబరిగా పురుహూతికా అమ్మవారు


పురుహూతికా అమ్మవారు

పిఠాపురం: పట్టణంలో ఉన్న రాజ రాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలో ఆషాఢ అమావాస్య సందర్భంగా పదో శక్తి పీఠం పురుహూతికా అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాదగయ క్షేత్రానికి స్వామి, అమ్మవార్ల దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాకినాడ గోశాలకు పశు గ్రాసం అందజేత


సర్పవరం గోశాలలో పశువులకు గడ్డి వేస్తున్న యువకులు

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన యువకులు కాకినాడ సమీపంలోని సర్పవరంలో ఉన్న గోశాలకు పశుగ్రాసం అందజేశారు. పశువులకు పచ్చగడ్డి కొరత ఏర్పడడంతో, గోశాలకు చెందిన నిర్వాహకుల సమాచారం మేరకు హుస్సేన్‌పురం గ్రామంలోని యువకులు ఆదివారం పొలం నుంచి పచ్చగడ్డి సేకరించి గోశాలకు పంపిణీ చేశారు. ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని గ్రామానికి చెందిన చల్లా బుజ్జిబాబు ఆధ్వర్యంలో యువకులు టేకుమూడు రాజు, పుప్పాల నాయుడు, మార్ని వీర్రాజు, టేకుమూడు బూరయ్య, అయినాల కృష్ణ, మార్ని దుర్గారావు, పుప్పాల శ్రీనులు వాహనంపై గడ్డిని గోశాలకు చేరవేశారు.

9న దివ్యాంగుల ఉపకరణాల శిబిరం

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు గుర్తించడానికి ఈ నెల 9న ఉదయం 9 గంటలకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ ఎన్‌డీ శ్యామ్‌సుందర్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాలలో ఎలిమికో సంస్థ సహకారంతో పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ భవనంలో శిబిరం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రాజప్ప పర్యవేక్షణలో విభిన్న ప్రతిభావంతులను గుర్తించి, వారికి అవసరమైన పరికరాలు అందజేస్తారని చెప్పారు. ఉపకరణాలకు కనీసం 40 శాతం వైకల్యం సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్ పొందడానికి 80 శాతం ఉండాలని చెప్పారు. శిబిరానికి వచ్చేవారు వారి సర్టిఫికెట్లతో పాటు, ఆధార్, రేషన్‌కార్డుల జెరాక్స్ కాపీలు తీసుకు రావాలని తెలిపారు.

ప్రమాదకరంగా గొయ్యి


యండపల్లిలో ఆలయం వద్ద ఏర్పడిన గొయ్యి

కొత్తపల్లి: ఈ ఫొటో ఉన్న గొయ్యి చూడడానికి చిన్నదిగా ఉన్నా ప్రమాదాలు మాత్రం ఎక్కువగానే జరుగుతున్నాయి. కొత్తపల్లి–నాగులపల్లి రోడ్డు యండపల్లిలో ఉన్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఈ గొయ్యి ఉంది. వాకతిప్పలో ఉన్న తాగునీరు పథకం నుంచి మూలపేట వరకూ ప్రధాన పైపులైను ఏర్పాటు చేశారు. ఈ పైపులైను ఏర్పాటులో భాగంగా రోడ్డు అడుగు భాగం నుంచి పైపులైన్ వేశారు. దీంతో రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యి కారణంగా యండపల్లి వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది అంతేకాకుండా ప్రయాణికులు ప్రమాద బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

పిఠాపురం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర అధికార మీడియా ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ పిలుపునిచ్చారు. గొల్లప్రోలు బీజేపీ పట్టణ కార్యాలయంలో ఆదివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా రవికిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో, అమ్మకు వందనం అని మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. నగర పంచాయతీ పరిధిలోని కైలాస భూమి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాజీ కౌన్సిల్ సభ్యులు తోట ఏడుకొండలు, పిఠాపురం పట్టణ అధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ, నియోజకవర్గ కోకన్వీనర్ వాసంశెట్టి శ్రీనువాసురావు, జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చదువుకోనాలంతే..!?

సమాజాభివృద్ధి విద్యతోనే సాధ్యమన్నది ప్రాపంచిక సత్యం. పాఠశాల స్థాయిలోనే చదువు సజావుగా సాగితే, విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి ఆస్కారం ఉంటుంది. గత ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి.. సర్కారు బడులతో పాటు, విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలన్నీ సమృద్ధిగా కల్పించింది. కార్పొరేట్ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చింది. తాజా ప్రభుత్వం వీటన్నింటినీ పక్కనపెట్టేసిందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు మాసాలు గడచినా.. ఇంకా పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లంటూ విద్యార్థులకు అరకొర వస్తువులు పంచుతుండడం.. ఆయా విమర్శలకు అద్దం పడుతోంది. విద్యా రంగ పథకాలను మున్ముందు ఏం చేస్తుందోనన్న అనుమానాలు ప్రజానీకాన్ని పట్టి పీడిస్తున్నాయి.


సామర్లకోటలో ఒకే గదిలో నిర్వహిస్తున్న ఐదు తరగతులు

- ప్రభుత్వ పాఠశాలల పై ప్రత్యేక శ్రద్ధ ఏదీ!
- మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతకు చెల్లుచీటీ
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- స్కూళ్లలో భర్తీ కాని పోస్టులు
- గాలిలో దీపంలా ప్రభుత్వ విద్యా వ్యవస్థ

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులిలా..

మండలం	ఖాళీలు
పెద్దాపురం	25
సామర్లకోట	38
కొత్తపల్లి	05
గొల్లప్రోలు	02
పిఠాపురం	42


సామర్లకోటలో ఒకే భవనంలో రెండు స్కూళ్లు నిర్వహిస్తున్న భరద్వాజ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 154 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 15,961 మంది విద్యార్థులు చదువుతున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 189 పాఠశాలల్లో 19.963 మంది విద్యనభ్యసిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులతో పాటు, నిత్యం ఎంఈఓలు తనిఖీలు నిర్వహిస్తున్నా, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆయా విద్యాసంస్థలపై ప్రభుత్వ యంత్రాంగం చూపుతున్న నిర్లక్ష్యమే ఇందుకు కారణమంటున్నారు. పాఠశాలల ప్రారంభంలో ఇవ్వాల్సిన స్టూడెంట్ కిట్ల పంపిణీలో జాప్యం మొదలు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయకపోవడం వరకూ అడుగడుగునా పాలకుల నిర్లక్ష్య ధోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇదే విధానం కొనసాగితే.. మున్ముందు ప్రభుత్వ విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు మారిపోతారన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ లేని 'భోజనం'

మధ్యాహ్న భోజన పథకాన్ని తరుచూ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఎలిమెంటరీ పాఠశాల వరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ద్వారా, హైస్కూల్ స్థాయిలో స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు భోజనం సరఫరా అవుతోంది. అనేక సందర్భాల్లో భోజనం నాసిరకంగా ఉంటుందనే ఆరోపణలున్నాయి. దాంతో పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 60 శాతానికి మించి పిల్లలు భోజనం చేయడం లేదని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల జిల్లా స్థాయి అధికారులు తనిఖీల్లో మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉన్నట్టు గుర్తించారు. భోజనం రుచి చూసి, నాసిరకంగా ఉన్నట్టు అధికారులు నిర్ధారించినప్పటికీ, కనీస చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పంపిణీలో జాప్యం

పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 189 పాఠశాల్లో స్టూడెంట్ కిట్లు పంపిణీ పూర్తి చేశారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 154 పాఠశాలల్లో జూన్ నెలాఖరు నాటికి పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ పూర్తి చేయగా, గత వారంలో బ్యాగ్‌లు, యూనిఫారం పంపిణీ చేపట్టారు. ఇది 98 శాతం పూర్తయినట్టు విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. ఆయా ప్రాంతాల్లో టీడీపీ కార్యకర్తల కారణంగా పంపిణీలో జాప్యం జరుగుతోందనే విమర్శలూ లేకపోలేదు. ఆగస్టు 15 నాటికి కొత్త యూనిఫారంతో అందరూ స్కూళ్లకు వస్తారా అనేది ప్రశ్నార్థకమే. ఆయా పాఠశాలల పరిధిలో ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడం వల్ల పంపిణీలో జాప్యం జరిగిందని చర్చించుకుంటున్నారు. ఈ నెల 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు ఉండటంతో కిట్ల పంపిణీ ప్రక్రియపై పాలక వర్గాలు దృష్టి సారించాయి.

టీచర్ల కొరతే కీలక సమస్య

ఉపాధ్యాయుల కొరతతో అనేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందనే వాదనలూ ఉన్నాయి. ఇటీవల అనేక మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడం,, కొందరు మరణించడంతో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెరిగిన విద్యార్థుల సంఖ్య నిష్పత్తి మేరకు టీచర్ల భర్తీ జరగడం లేదని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

ఒకే గదిలో రెండు తరగతులు

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే, రెండు, మూడు తరగతులకు ఒకే గదిని ఉపయోగించడం సర్వసాధారణంగా మారింది. 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలనే నిబంధన ఉంది. 25 నుంచి 30 మంది మాత్రమే విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు ఉంటున్నారు. అటువంటి పాఠశాలలో రెండు తరగతులను కలిపి నిర్వహిస్తున్నారు.

ఇక్కడ.. రెండు స్కూళ్లు ఒకే పాఠశాలలో..

సామర్లకోట సత్యనారాయణపురం భరద్వాజ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో రెండు పాఠశాలలు ఒకే స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. స్థానిక జగ్గమ్మగారిపేటలో ఎలిమెంటరీ పాఠశాల అద్దె భవనంలో ఉండేది. అది శిథిలం కావడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్‌లో ఎలిమెంటరీ పాఠశాలను మార్పు చేశారు. ఈ క్యాంటీన్లను ఈ నెల 15 నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో, జగ్గమ్మగారిపేటలోని ఎలిమెంటరీ పాఠశాలను భరద్వాజ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోకి మార్పు చేశారు. ఆ పాఠశాలలో ఒకే తరగతి గదిలో ఐదు క్లాసులు నిర్వహిస్తున్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. టీచర్ల కొరత కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు, విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయి. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు సర్కారు బడుల్లోనే చదివేలా చర్యలు తీసుకోవాలి.

– పరిమి శ్రీను, ఆర్బీ పట్నం, పెద్దాపురం మండలం

ఉత్తీర్ణత శాతం పెరగాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ ఉపాధ్యాయులున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇంటర్, డిగ్రీ చదివిన వారితో బోధన చేస్తున్నా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఆయా కారణాలు అన్వేషించాలి. ప్రతి పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులు భర్తీ చేయాలి.

– పుట్టా బుజ్జిబాబు, జి.మేడపాడు, సామర్లకోట మండలం

భక్తిశ్రద్ధలతో మడుగులమ్మ జాతర


జాతరలో డప్పు డ్యాన్సులు


జాతర ఊరేగింపులో ప్రత్యేక వాహనంలో ఉన్న అమ్మవారు

సామర్లకోట: పంచారామ క్షేత్రం సమీపంలో వేంచేసి ఉన్న మడుగులమ్మ జాతర ఉత్సవం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఏటా ఆషాఢ మాసం చివరి అమావాస్య రోజున జాతర ఉత్సవాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ కమిటీ నాయకుడు వల్లూరి దొరబాబు ఆధ్వర్యంలో జాతర ఉత్సవం నిర్వహించగా, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పూలతో, విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనంపై ఉంచి, బాణసంచా కాల్పులు, బ్యాండ్ మేళం, గరగల నృత్యం, డప్పుడాన్సు, కోయ డాన్సు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఊరేగించారు. ఆలయం నుంచి రైల్వే గేటు మీదుగా గాంధీచౌక్‌కు చేరింది. అక్కడ మహిళలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. గాంధీచౌక్ నుంచి పెద్దవీధి, గొల్లగూడెం, నీలమ్మ చెరువు, మఠం సెంటర్, కొత్తూరు మీదుగా ఊరేగింపు రాత్రికి ఆలయానికి చేరింది. రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమార స్వామి, పడాల పుత్రయ్య భక్తులకు సేవలందించారు. ఎస్సై సింహాద్రి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రేపటి నుంచి అధికారులకు శిక్షణ

సామర్లకోట: వివిధ జిల్లాలకు చెందిన అధికారులు ఈ నెల ఆరు నుంచి స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ)లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు ఈ శిక్షణ ఉంటుందని ఆదివారం ఆయన విలేకర్లకు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలోను సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయాలని సూచించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల ఉన్నతాధికారులకు అవగాహన కల్పించేందుకు మూడు రోజుల చొప్పున శిక్షణ ఇస్తామన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 17 ఉండగా, 9 లక్ష్యాలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే మూడు లక్ష్యాలపై శిక్షణ పూర్తయిందన్నారు. శిక్షణలో భాగంగా ఆరో తేదీ నుంచి ఈ నెలలో నాలుగు బ్యాచ్‌లకు నాలుగు లక్ష్యాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. మంగళవారం నుంచి 'సుపరిపాలన కలిగిన గ్రామం' అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. జెడ్పీ, డీపీఓ, డీఆర్‌డీఏ, ఉపాధిహామీ, డీపీఓ, డ్వామా, ఐసీడీఎస్, వైద్యారోగ్య, విద్య, వ్యవసాయ శాఖల అధికారులు శిక్షణకు హాజరవుతారని తెలిపారు.

గ్యాస్ పైపులైన్ పనుల అడ్డగింత

సంస్థ పరిహారం ఇవ్వడం లేదని కౌన్సిలర్ హరిబాబు ఆరోపణ


గ్యాస్ పైపులైన్ పనులను అడ్డుకున్న కౌన్సిలర్

సామర్లకోట: పట్టణ పరిధిలో పనులు నిర్వహిస్తున్న భాగ్యనగర్ గ్యాస్ కంపెనీ పనులను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆదివారం అడ్డుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో గ్యాస్ పైపులైన్లు పనులు నిర్వహించి, పరిహారం చెల్లించకపోవడం వలన రోడ్లు గుంతలు గానే మిగిలిపోతున్నాయని హరిబాబు ఆరోపించారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్ పనులకు సంబంధించి మున్సిపాలిటీ చెల్లించవలసిన నష్ట పరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గత 8 ఏళ్ల క్రితం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో సత్యనారాయణపురం షోడ్డులో గ్యాస్ పైపులైను వేశారని, ఇప్పటికీ ఆ రోడ్డు నిర్మించక పోవడం వలన గోతులతోనే ఉందన్నారు. ఇదే పరిస్థితి మిగిలిన రోడ్లకు ఏర్పడరాదని, ఇప్పుడు ఇక్కడ అడ్డుకున్నట్టు చెప్పారు. భాగ్యనగర్ గ్యాస్ కంపెనీ నుంచి మున్సిపాలిటీకి రావలసిన బకాయిలను వసూలు చేయాలని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ మోజెస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. దీనిపై వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ మాట్లాడుతూ మున్సిపాలిటీ మీదుగా వెళుతున్న భాగ్యనగర్ గ్యాస్ పైపు లైన్లకు సంబంధించి అధికారులు అంచనాలు తయారు చేశారన్నారు. ఈ మేరకు రూ.79,50,247 చెల్లించాలని కమిషనర్ 2021, డిసెంబర్‌లో నోటీసులు పంపినా, ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. కౌన్సిల్ సమావేశంలో దీనిపై అధికారులకు సూచించామని చెప్పారు. ఇప్పటికైనా గ్యాస్ కంపెనీ నుంచి బకాయిలు వసూలు చేసి, పట్టణంలో అభివృద్ధి పనులకు వినియోగించాలన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ నగరంలోని శారదాదేవి ఆలయ సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. అలాగే ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ 0884–2357800కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ భావన తెలిపారు.

సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం


సమావేశం మాల మహానాడు నాయకులు


దివిలిలో నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

పిఠాపురం: ఎస్సీ, ఎస్టీలను ఉప కులాలుగా వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అధికారాలు కల్పించేలా సుప్రీం కోర్టు ఈ నెల ఒకటో తేదీన ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి (ఆర్టికల్ 341) పూర్తి వ్యతిరేకమని దీనిని వ్యతిరేకిస్తున్నామని పలువురు మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. పీవీ రావు మాలమహానాడు పిఠాపురం పట్టణ అధ్యక్షుడు వేళంగి వెంకటేష్ అధ్యక్షతన ఆదివారం పిఠాపురం చెలికాని భావనరావు సభా సదన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల అత్యవసర సమావేశంలో వారు మాట్లాడారు. ఇదే విషయంలో సుప్రీం కోర్టు 2004 నవంబరు 5న ఇచ్చిన తీర్పును కాదని మళ్లీ అదే సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని వారు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలను ఉప కులాలుగా వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అధికారాలు కల్పించేలా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా తమ పోరాటం యథావిధిగా కొనసాగుతుందన్నారు. త్వరలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ తీర్పుపై స్పందించిన లోక్ జనశక్తి నాయకులు, పార్లమెంటు సభ్యులు శిరాగ్ పాశ్వాన్, భీమ్ ఆర్మీ నేత, పార్లమెంటు సభ్యులు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కొంగు నూకరాజు, దడాల నూకరాజు, ఇజ్జిన చలపతి రావు, బత్తుల రాంజీ కుమార్, మాతా బాలకృష్ణ, శీకోలు శేఖర్, కొంగి కిషోర్, రోకళ్ల సూరిబాబు, చంటిబాబు, రామకృష్ణ, బళ్ల సురేష్, చినబాబు, రమణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై నిరసన

పెద్దాపురం: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ అంశంపై ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మండలంలోని దివిలి గ్రామంలో ఆదివారం ఏపీ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కండెల్లి వీరబాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలను ప్రస్తావించారు. ఎస్సీలకు ఒకసారి ఉద్యోగం వస్తే.. వారిని రిజర్వేషన్ నుంచి తొలగించాలని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రిజర్వేషన్లు అంటరానితనం వల్ల వచ్చిందే కానీ, ఆర్థిక అంశం, వెనుకబాటుతనం వల్ల కాదన్నారు. ఈ సందర్భంగా మూడు అంశాలపై సమావేశంలో తీర్మానించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమావేశంలో నాయకులు బండి రాజు, పిల్లి అప్పారావు, నిక్కి శ్రీను, మేడే ప్రసాద్, జుత్తుక సత్యనారాయణ, కాటూరి సత్తిబాబు, మడికి శ్రీను, మడికి వెంకటకృష్ణ, కుంచే నూకరాజు, నిమ్మగంటి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మురికి కూపంగా జగ్గయ్య చెరువు కాలనీ



జగ్గయ్య చెరువు కాలనీలో రోడ్ల దుస్థితి

పిఠాపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జగ్గయ్య చెరువు కాలనీ ముంపు బారినపడి మురికి కూపంగా మారింది. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 10వేల మంది జనాభా ఉన్న ఈ కాలనీలో కనీస సౌకర్యాలు కరువై ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. వర్షాలు వస్తే కాలనీ రోడ్లు అన్ని జలమయమై కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తైక్వాండో పోటీల్లో కాకినాడ జిల్లా ప్రతిభ


ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం సాధించిన జిల్లా క్రీడాకారులు

ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విశాఖలో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ తృతీయ స్థానం సాధించారని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో రెండు బంగారు, 8 రజత, 13 కాంస్య పతకాలను జిల్లా క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. మొత్తం 23 పతకాలతో తృతీయ స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, శిక్షణ అందించిన కోచ్‌లను జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి జి.ఎలీషా బాబు, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అభినందించారు.

ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు జరుగుతుందని, సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ పిఠాపురం నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఇందిరానగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రావు విగ్రహాలకు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆరుగుల జార్జి, కాకాడ చిట్టిబాబు, పిఠాపురం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి జయరాజు, కొల్లి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబాను దర్శించుకున్న సీఐ


సాయిబాబా వారిని దర్శించుకుంటున్న సీఐ అంకబాబు

సామర్లకోట: కొత్తగా బాధ్యతలు చేపట్టిన సామర్లకోట సీఐ ఆర్ అంకబాబు ఆదివారం సాయంత్రం స్థానిక స్టేషన్ సెంటర్‌లో టున్న షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాబావారికి ప్రత్యేక పూజలు చేశారు. సీఐల బదిలీల్లో భాగంగా ఆయన సామర్లకోట స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే. అర్చకుడు భమిడిపాటి శ్రీనివాసు పూజలు చేసి, సీఐకి ఆశీర్వచనాలు అందజేశారు.

దళితుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కాకినాడ సిటీ: సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన దళిత యువకుడు చాప అజయకుమార్‌ను తాళ్లతో కట్టి, హింసించి, తీవ్రంగా కొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. సమితి నాయకులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ భానుమతి, టి.నూకరాజు ఆదివారం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అజయ్‌కుమార్‌ను పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, దోషులను కఠినంగా శిక్షించాలని ఉన్నతాధికారులను కోరతామన్నారు. దళిత యువకుడిని దారుణంగా హింసించి, రక్తం వచ్చేలా దాడి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనలో నిందితులైన వారిని వెంటనే అరెస్టు చేసి, శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


భద్రం మృతదేహం

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురంలో పిఠాపురం రోడ్డును ఆనుకుని బస్ షెల్టర్ వద్ద ఆదివారం ఓ వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించాడు. అతడు కాకినాడ జగన్నాథపురానికి చెందిన లక్కోజి భద్రం(34)గా గుర్తించారు. తిమ్మాపురం పోలీసుల వివరాల ప్రకారం, మద్యానికి అలవాటు పడిన భద్రం అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికి దూరంగా ఉంటున్నాడు. తిమ్మాపురంలో అతడు ఉన్నట్టు బంధువులకు తెలిసింది. వారు ఆదివారం అక్కడకు వెళ్లి చూసేసరికి భద్రం చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదాన శిబిరం

కాకినాడ సిటీ: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక కచేరిపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ షాన్ మోహన్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు.